# ధన బలం.. ప్రజా బలం

ములుగులో వెలసిన ఎమ్మెల్యే అభ్యర్థుల పోస్టర్లు




ములుగులో వెలసిన ఎమ్మెల్యే అభ్యర్థుల వాల్‌పోస్టర్లు

## ప్రజలను ఆకట్టుకుంటూ.. ఆలోచింపజేస్తున్న పోస్టర్లు

ములుగు రూరల్, అక్టోబర్ 17 : ములుగు జిల్లాలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రజల్లో ఆసక్తిని రేపుతున్నాయి. నియోజకవర్గంలో ఒక వైపు కాంగ్రెస్ నుంచి రెండు సార్లు గెలుపొందిన ధనసరి అనసూయ (సీతక్క) పోటీ చేస్తుండగా ఆమెను ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బడే నాగజ్యోతిని బరిలో నిలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ములుగు ప్రధాన కూడళ్లలో 'ధనసరి అనసూయ ధన బలం.. బడే నాగజ్యోతి ప్రజా బలం' అంటూ వెలసిన వాల్ పోస్టర్లు ప్రజలను ఆకట్టుకుంటూ ఆలోచింపజేస్తున్నాయి. ఈ పోస్టర్లలో ఖరీదైన ఓపెన్‌టాప్ కారులో సీతక్క కాన్వాయ్‌తో వస్తుండగా, నాగజ్యోతికి సంబంధించి ఆమె స్వగ్రామంలోని పూరి గుడిసె ఉంది. వీటిని ప్రజలు ఆసక్తిగా చూస్తూ చర్చించుకుంటున్నారు. కాగా, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరూ నక్సల్ కుటుంబాల నుంచి వచ్చిన వారే కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ములుగు నియోజకవర్గం ప్రత్యేకతను సంతరించుకుంది. అయితే ఇందులో బడే నాగజ్యోతిదిమావోయిస్టు నేపథ్యం ఎక్కువగా ఉన్న కుటుంబం. పీడిత ప్రజల కోసం అడవి మార్గాన్ని ఎంచుకున్న ఆమె తల్లిదండ్రులు బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకరన్న, బడే రాజేశ్వరి అలియాస్ నిర్మలక్క పోలీసుల ఎదురు కాల్పుల్లో అసువులు బాసారు. మూడు నెలల పసి గుడ్డుగా ఉన్న నాగజ్యోతిని తన తండ్రి చేతిలో పెట్టి వెళ్లిన నాగేశ్వర్‌రావు తిరిగి బిడ్డ ముఖం చూడలేదు. తల్లిదండ్రులు లేకుండా అనాథలా ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకున్న నాగజ్యోతి 2019–2023 మధ్య సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎదిగారు. సెంటు భూమి, ఇల్లు లేని నాగజ్యోతి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచింది. ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన సీతక్క గతంలో జనశక్తిలో పనిచేసి రాజకీయ ప్రవేశం చేశారు. ప్రస్తుతం వీరిద్దరూ ఎన్నికల్లో పోటీపడుతున్న నేపథ్యంలో ములుగులో వెలసిన వాల్ పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి.



కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

## తాడ్వాయిని ఏటూరునాగారం ఆర్డీలో కలపాలి

ములుగు టౌన్, అక్టోబర్ 17 : తాడ్వాయి మండలాన్ని ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని కోరుతూ మండల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 జీపీల ప్రజలు గ్రామ సభలు నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేశారని, వారి అభీష్టం మేరకు ఏటూరునాగారంలోనే తాడ్వాయిని కొసాగించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రేగ నర్సయ్య, కర్నెబెల్లి శివయ్య, చంద రఘుపతి రావు, కొప్పుల రవి, పెసా కో ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, జేఏసీ, ఆదివాసీ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



నిందితులతో వాజేడు పోలీసులు

వాజేడు, అక్టోబర్ 17 : ఏటూరునాగారం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వాజేడు ఎస్సై చావ్వాళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని పూసూరు బ్రిడ్జి వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పల్సర్ బైక్‌పై ఇద్దరు యువకులు ఏటూరునాగారం నుంచి మండపాక వైపు వస్తుండగా తనిఖీచేయగా వారి వద్ద రూ. 13,860 విలువైన 20 ఐబీ, 50 ఓఏ క్వార్టర్ బాటిళ్లు లభించాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వాటిని తరలిస్తున్న కొప్పుసూరుకు చెందిన షేక్ ఖాదర్‌బాబా, కొంగాలకు చెందిన పర్శిక్ అజిత్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

గోవిందరావుపేట, అక్టోబర్ 17 : మండలంలో గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. చల్వాయి గ్రామానికి చెందిన బండి భిక్షపతి, మచ్చాపూర్‌కు చెందిన ఓరుగంటి రాజయ్య గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా వారి వద్ద 10 లీటర్ల చొప్పున గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**బెల్ట్ షాపులపై దాడులు**

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని బెల్ట్ షాపులపై మంగళవారం పోలీసులు ముమ్మర దాడులు చేశారు. ఈ సందర్భంగా గోవిందరావుపేటలో బెల్ట్ షాపు నడుపుతున్న అజ్మీరా పద్మ వద్ద సుమారు రూ. 7,557 విలువ గల మద్యం, బీర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు.



కొత్తూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

కన్నాయిగూడెం, అక్టోబర్ 17 : మండలంలోని కొత్తూరు, ఏటూరు ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఈ సందర్భంగా గదుల్లో కరెంట్, టాయిలెట్స్, తాగునీటి ఏర్పాట్లతో పాటు అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 20 వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని ఓటరు జాబితాను పరిశీలించి కొత్త ఓటరు నమోదు, షిఫ్ట్ అయినవి, తొలగించిన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీపీవో వెంకయ్య, తహసీల్దార్ సలీం, ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ గణేశ్ ఉన్నారు.

## ఆరోగ్య మహిళా కేంద్రం తనిఖీ

ఏటూరునాగారం, అక్టోబర్ 17 : మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ మంగళవారం సందర్శించారు. ఈ కేంద్రానికి వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి వ్యాధులకు సంబంధించిన వారు వస్తున్నారో తెలుసుకున్నారు. వైద్యురాలు సుమలత, వైద్య సిబ్బందితో మాట్లాడారు. సెంటర్‌కు వచ్చే వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్రాంతి కుమార్ వివరించారు.

## నేడు ఇంటింటా ప్రచారం

ఏటూరునాగారం, అక్టోబర్ 17 : మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఇంటింటా ప్రచారం చేపట్టనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాజాపాషా ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆదేశానుసారం నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

## జ్వరాలపై ఇంటింటా సర్వే

ఏటూరునాగారం, అక్టోబర్ 17 : మండలంలోని రామన్నగూడెంలో వైద్య సిబ్బంది మంగళవారం జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. రాంనగర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్‌గా వచ్చే జ్వరాలు, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. జ్వరాలున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు సుచరిత, హెల్త్ అసిస్టెంట్ జైలుబాబు, ఆశ వర్కర్ హేమలత, గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**వాజేడులో..**

వాజేడు : జ్వరాలపై అప్రమత్తంగా ఉండి స్థానిక పీహెచ్‌సీ లేదా పల్లె దవాఖానకు వచ్చి చికిత్స పొందాలని వైద్యాధికారి జ్ఞానస సూచించారు. మండలంలోని మొరుముకు, మొరుమురుకాలనీ గ్రామాల్లో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. బాధితు నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, కన్యాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు ఊషారాణి, రమాదేవి, ఆశ కార్యకర్తలు ముత్తమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : సర్వే చేస్తున్న సిబ్బంది

## నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి

వెంకటాపూర్, అక్టోబర్ 17 : మండలంలోని లక్ష్మీదేవిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతికి మద్దతుగా ముఖ్య నాయకులు, 100 ఓట్ల ఇన్‌చార్జిల సమావేశాన్ని మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ బుర్ర రజితా సమ్మయ్యగౌడ్, జడ్పీటీసీ గై రుద్రమదేవీ అశోక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్క రమేశ్, సూరనేని మురళీధర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్లు మాడుగుల రమేశ్, ఎర్రబెల్లి గోపాల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ములుగు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల సుచరితాశ్రీధర్‌రెడ్డి, గట్టు కుమారస్వామి, పత్రి లక్ష్మీదశరథం, తండా రమేశ్, కూరెళ్ల రామాచారి, రాజుకుమార్, అంతటి రాము, నగేశ్, సుదర్శన్, అలీమియా, మధుయాదవ్, సదయ్య, రాజయ్య, రాజు, వీరస్వామి, కుమారస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

**భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రావు**

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 17 : ప్రజలు ఒక్కసారి ఆశీర్వదించి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. తెలంగాణలో సీఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష అన్నారు. వెంకట్రావు వెంట జజ్జరి నారాయణమ్మ, బొల్లె లలిత, ఆలుబాక సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి తదితరులున్నారు.



పార్టీ శ్రేణులతో తెల్లం వెంకట్రావు

## దుర్గామాతకు ఘనంగా పూజలు

గోవిందరావుపేట, అక్టోబర్ 17 : మండలంలోని పస్రా రామాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాతకు మంగళవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే దుర్గామాత మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## జిల్లా స్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

మంగపేట, అక్టోబర్ 17 : మండల యూత్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కమలాపురంలోని బిల్ట్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని మంగపేట ఎస్సై గోదరి రవి కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో స్నేహ భావంతో పాటు, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి ఈ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు పల్లపు రమేశ్, అజ్మత్ పాషా, బండి రాకేశ్, అన్వేశ్, కల్యాణ్, నవీన్, చల్లా రాంకీ, ఖాలిద్, కొమరగిరి సురేశ్, షణ్ముక్, వెంకటసాయి, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై తదితరులు